క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో టీచర్లు

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి ఆఫీఫా రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం గోవింద రాజులు తెలిపారు. సోమవారం ఆయన ఆ విద్యార్థినిని అభినందించి మాట్లాడారు. ఈ నెల 2వ తేదీన నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి 48 కేజీల జూడో పోటీల్లో ఆఫీఫా పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 9,10 తేదీల్లో మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రుద్రవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రుద్రవరం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే 104 వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు అన్నారు. మండల కేంద్రం రుద్రవరం గ్రామ సచివాలయం-1లో సోమవారం-104 వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న ఆయన బీపీ, షుగర్, అస్తమా, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘ కాలిక వ్యాధులు గల వారికి వైద్య పరీక్షలు చేసి తగిన మందులు అందజేశారు. అలాగే సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హేమ, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ ఝాన్సీ రాణి, డేటా ఆపరేటర్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఉయ్యాలవాడ ఎస్ఐగా రామిరెడ్డి



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామిరెడ్డి

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ ఎస్ఐగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఈ ఏడాది జూన్ 24న ఉమ్మడి కర్నూలు జిల్లా సీఐడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ రామిరెడ్డిని ఉన్నతాధికారులు ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌కు నియమించారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డబ్బాపాలు వద్దు



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

శిరివెళ్ల: చిన్నారులకు డబ్బా పాలకంటే తల్లి పాలే శ్రేష్టమని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం గోవిందపల్లెలో తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేది వరకు తల్లి పాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. పాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

నేడు నంద్యాల డయాసిస్ బిషప్ పట్టాభిషేకం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ బిషప్‌గా కె.సంతోష్ ప్రసన్నరావు మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఈ విషయాన్ని సోమవారం నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాంఢ్లీ విలియం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాలలోని హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయ ఆవరణలో ప్రమాణస్వీకారం కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ముఖ్యఅతిథులుగా చర్చ్ ఆఫ్ సౌంత్ ఇండియా మోడరేటర్ రూబెన్‌మార్క్, సీఎస్ఐ సినాడు జనరల్ సెక్రటరీ ఫెర్నాండ్ రత్నరాజ తదితరులు హాజరవుతారని నంద్యాల డయాసిస్ పరిధిలోని పాస్టరేట్ కమిటీ సభ్యులు, డీనరీ చైర్మన్లు, గురువులు, సంఘ కాపరులు, క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

29న జాతీయ క్రీడా దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈనెల 5 నుంచి, జోనల్‌స్థాయి పోటీలు 11 నుంచి, రాష్ట్రస్థాయి పోటీలు 16 నుంచి జరుగుతాయన్నారు. వివరాలకు సెల్: 87126 22576ను సంప్రదించాలన్నారు.

నమ్మకద్రోహం బాబు నైజం

- ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవి ధ్వజం
- కానాలలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీకి విశేష స్పందన





కానాల గ్రామంలో బాబు ష్యురిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు, మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(అర్బన్): మాయమాటలతో నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నైజమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి వచ్చిన శిల్పారవికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక పాఠశాల వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో శిల్పారవి మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలు అవుతోంది. ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీలు అమలుకు నోచుకోలేదు. అధికారంలోకి రాగానే హామీలు అమలు చేస్తామని నాడు ప్రచారం చేశారు. ఇప్పుడు వాటి గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు కొన్ని కుటుంబాలకే అందాయి. గతేడాది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ కింద సాగు అయిన పంటలకు ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు మద్దతు ధరతో పంటల కొనుగోలు జరిగేది. కూటమి సర్కారు ఇప్పుడు వాటిని తుంగలో తొక్కింది'ని మండిపడ్డారు.

మాయమైన మహిళలు ఎక్కడ?

ఎన్నికల ముందు రాష్ట్రంలో 30వేల మంది మహిళలు మాయమయ్యారని ప్రచారం చేశారు. ఇప్పుడు వారిని రప్పించారా అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మాజీ ఎమ్మెల్యే శిల్పారవి ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా వారి ఆచూకీ తెలపలేకపోయారన్నారు. సీజ్‌ద షిప్ అంటూ నాడు హడావుడి చేసిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. అబద్ధాలు, అవాస్తవాలతో ఎల్లకాలం ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలు ఇప్పుడు వాస్తవాలు తెలుసుకుంటున్నారని, త్వరలో వారు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే తిరిగి వైఎస్ జగన్ రావాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకతను మూటకట్టుకున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని ధ్వజమెత్తారు సుపరి పాలనలో తొలి అడుగు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. పాలనా పరంగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని భావించిన కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్న చూపిన బాటలో నడిచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం కూటమి మోసాలను తెలియజేసే క్యూఆర్ కోడ్‌లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీలు రంగారావు, మోహిద్దీన్‌బీ, వైస్ సర్పంచ్ తిరుపాల్‌రెడ్డి, నాయకులు రత్నబాబుచౌదరి, గ్రామ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



ఆధారాలు చూపుతూ మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. రైతులకు యూరియా అందే వరకు వారికి అండగా నిలబడి పోరాడుతామని అన్నారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు పంపిణీ చేయాల్సిన ఎరువులను టీడీపీ నాయకులు దగ్గరుండి ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ఎరువులను బ్లాక్ చేసి అమ్ముకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని గోస్పాడు, నంద్యాల మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరమణ వ్యవసాయ సిబ్బంది పక్కన కూర్చొని ఎరువులు పంపిణీ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. జూలేపల్లి గ్రామంలో పెద్ద సుబ్బా రెడ్డి, రెడ్డి రవి అనే టీడీపీ నాయకులు దగ్గరుండి ఎరువులు పంపిణీ చేశారన్నారు. జిల్లెల గ్రామంలో రైతులకు అందించాల్సిన ఎరువుల లారీని గ్రామంలో నిలిపి వేసి చంద్రశేఖర్ రెడ్డి అనే టీడీపీ నాయకుడు పక్కకు తరలించారన్నారు. నెహ్రూనగర్‌లో వెలుగొండా రెడ్డి, రమణా రెడ్డి అనే టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎరువుల పంపిణీ జరుగుతుందని, చాబోలు గ్రామంలో రెండు లారీల ఎరువుల లోడ్ వస్తే టీడీపీకి చెందిన ఇద్దరు నేతలు జోజి రెడ్డి, జయ చంద్రా రెడ్డిలు చెరో లారీ లోడ్ ను అక్కడి నుంచి తరలించారన్నారు. ఇందుకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని వాటిని మీడియాకు చూపించారు. కష్టకాలంలో అన్నదాతలను ఆదుకోవాల్సిన సర్కారు ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం, అరెస్ట్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. రైతులంటే ఆది నుంచి చంద్రబాబుకు ప్రేమ లేదని, గతంలో బుల్లెట్ల వర్షం కురిపించిన విషయం ఎవరు మరిచిపోలేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్కెఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగి రెడ్డి, గోస్పాడు మండలం సొసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బా రెడ్డి, ఎం.కృష్ణాపురం సర్పంచ్ కోటి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏం పోలేదు.. వదిలేయండి!

- డబ్ల్యూ కొత్తపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లోకి చొరబడిన దొంగలు
- వివరాలు చెప్పేందుకు సుముఖత చూపని హెచ్‌ఎం, పోలీసులు



వెంటిలేటర్‌ను పగులగొట్టిన దుండగులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో చోరీ యత్నం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదికి వెనుగ భాగాన ఉన్న వెంటిలేటర్ పగుల గొట్టి దుండగులు లోపలికి ప్రవేశించి రికార్డులు, వస్తువులను చెల్లాచెదురుగా పడేశారు. పాఠశాలకు సెలవు రోజైన ఆదివారం జరిగిన ఈ ఘటన ఆకయితాల పనే..లేక దొంగలదా అన్నది తెలియాల్సి ఉంది.

గదికి లోపల తాళం వేయడం ఏంటి?

ప్రధానోపాధ్యాయుడి గదిలోకి ప్రవేశించిన దుండగులు రికార్డులు, మరి కొన్ని వస్తువులను చెల్లాచెదురుగా పడేశారు. విచిత్రం ఏమంటే లోపల ప్రధాన వాకిలికి గొళ్లెం పెట్టి తాళం వేసి వెళ్లి పోయారు. రోజులాగే ఉదయం హెచ్‌ఎం దస్తగిరి పాఠశాలకు వచ్చి తన గది తాళాలు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. తలుపులు రాకపోవడంతో లోపల గొళ్లెం ఎవరు పెట్టారని చూడగా వెంటిలేటర్ ద్వారా దుండగులు ప్రవేశించినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని హెచ్‌ఎం.. గ్రామస్తులు, పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు, క్లూస్ టీం వచ్చి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. చోరీ జరగలేదని, ఏ వస్తువులు పోలేదని హెచ్‌ఎం చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు చెప్పేందుకు పోలీసులు నిరాకరించారు. ఇదిలా ఉంటే రాత్రివేళల్లో పాఠశాల ఆవరణలో కొందరు మందు తాగుతున్నారని, పోలీసులు నిఘాపెట్టాలని మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గతంలో పెద్దమ్మ ఆలయం తలుపు పగుల గొట్టినా ఏమీ పోలేదని వదిలేశారు. ప్రస్తుతం స్కూల్లో కూడా ఏం పోలేదని వదిలేస్తే ఎలా అన్నారు. విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

కార్పొరేట్లకు కూటమి సర్కారు ఊడిగం

- పీడీఎస్‌యూ నాయకులు ధ్వజం



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు శేషఫణి మండిపడ్డారు. సోమవారం పట్టణంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పద్మావతినగర్ సర్కిల్ నుంచి రామకృష్ణ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థి సంఘాలకు ప్రవేశం లేదని ఈనెల 1వ తేదీన కూటమి సర్కారు చీకటి జీవో తీసుకొచ్చిందన్నారు. విద్యారంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నంద్యాల జిల్లా నాయకులు శంకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా, వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని విద్యార్థులను పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్‌బాషా, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమణకుమార్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ



స్వామి అమ్మవార్ల వెండిరథోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భా గంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఓర్వలేక మినరల్ వాటర్ ప్లాంట్ కూల్చివేశారు

- జాయింట్ కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫిర్యాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి

నంద్యాల: ప్రజల దాహం తీర్చే మినరల్ వాటర్ ప్లాంట్‌పై తన ఫొటో ఉండటాన్ని చూసి ఓర్వలేక మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఏకంగా ప్లాంట్‌నే కూల్చివేయించారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వాటర్ ప్లాంట్ కూల్చివేత ఘటనపై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతకం రామిరెడ్డి మాట్లాడుతూ 2019 డిసెంబర్‌లో పాత బస్టాండ్ సమీపంలోని గ్రామ కంఠ భూమిలో పంచాయతీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశానన్నారు. ఈ వాటర్ ప్లాంట్‌లో కూలింగ్ వాటర్ సదుపాయం కూడా కల్పించానన్నారు. అయితే, ఈ ప్లాంట్‌పై తన ఫొటో ఉందని మంత్రి కూల్చివేయించడం ఎంత వరకు సబబు అన్నారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనుమతి, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా పోలీసులను కాపలా పెట్టి ప్రైవేటు గూండాలతో కూల్చివేయించారన్నారు. ఆ సమయంలో ప్లాంట్‌లోని మిషన్లను సైతం దొంగిలించారన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. దీనిపై డీపీఓతో విచారణ చేయిస్తానని జాయింట్ కలెక్టర్ మాజీ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి , ఆళ్లగడ్డ మాజీ బిజేంద్రారెడ్డి ఉన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి అభినందన



ఫయాజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్‌ను సోమవారం స్థానిక కార్యాలయంలో పలువురు అభినందించారు. బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ రవి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల విశాఖ పట్టణంలో జరిగిన ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన క్రీడల్లో విజయానికి దోహదపడుతాయన్నారు. ఫయాజ్‌ను అభినందించిన వారిలో లీగల్ అడ్వైజర్ అలీహుసేన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, బాక్సింగ్ ఇన్‌చార్జి సర్దార్, కోచ్‌లు చంద్ర, మహబూబ్‌బాషా, ఉపేంద్ర, మద్దిలేటి, ప్రసాద్, జశ్వంత్, నవాజ్, తదితరులు ఉన్నారు.

ఆకు కూరలతో ఆరోగ్యం పదిలం



ఆకు కూరలు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రుద్రవరం: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ ఎంసీఆర్‌పీ శివశంకర్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు,ఆకు కూరల అమ్మకాల స్టాల్ ఏర్పాటు చేశారు. రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు మంచి లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్ సుబ్బరాయుడు, నరసింహ్ముడు, సుభద్ర తదితరులు ఉన్నారు.

దొర్నిపాడులో భారీ వర్షం



డబ్ల్యూ గోవిందిన్నె శివారులో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపునీరు

దొర్నిపాడు: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లడంతో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము, మొక్కజొన్న పంటల్లో వర్షపునీరు ప్రవహించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అధిక తేమ శాతం కావడంతో పంట రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచమఠాలలో విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈవో హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఘంటామఠంలో దేవతా మొక్కలైన బిల్వం మొక్కను దేవస్థాన ఈఓ నాటారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ప్రజలకు సంబంధించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ వినతులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారునికి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 289 వినతులు వచ్చినట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాము నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి

రుద్రవరం: మండల పరిధిలోని నల్లవాగుపల్లె వద్ద సోమవారం రాత్రి మోటర్ సైకిల్ మీద నుంచి ఓ వ్యక్తి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ మార్గంలో వెళ్లే వారు గుర్తించి వెంటనే క్షతగాత్రుడిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆళ్లగడ్డ నుంచి నల్లవాగుపల్లె వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షడ్రక్‌కు నివాళి



షడ్రక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన షడ్రక్ 5 వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నేత మహమ్మద్ గౌస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, సీనియర్ నాయకులు తోటమద్దు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనకు అలుపెరగని పోరాటం చేసిన నాయకుడు షడ్రక్ అని కొనియాడారు. దళితుల పక్షాన నిలబడి వారికి భూములు, ఇళ్ల స్థలాలు ఇప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు, బాలవెంకట్, జైలాన్, గోపాల్, సుబ్బారావు, వెంకటరావు, దస్తగిరి, షఫీ, తదితరులు పాల్గొన్నారు.